సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 2 | సెప్టెంబర్ | 2023



వంద శాతం ఫలితాలు సాధించాలి

గిరిజన విద్యాసంస్థల్లోని పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. - 8లో



ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఘనత

ఆక్యుపెన్సీ రేషియోలో వరంగల్ రీజియన్ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
$32^0/24^0$

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఒకటి రెండు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యారణ్యపురి: శిక్షణలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ ఉపాధ్యాయులను కోరారు. మూడ్రోజులుగా జిల్లాలోని వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లకు 'ఉన్నతి'పై ఇస్తున్న శిక్షణ ముగిసింది. హసన్‌పర్తి మండలంలోని టీఎస్ఆర్ఎస్ తెలుగు శిక్షణ కేంద్రంలో ముగింపు సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు భాషా బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నతి మౌలిక లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ మనోజ్‌కుమార్, పరిశీలకులు డీసీఈబీ కార్యదర్శి బి.రాజన్న, స్థానిక హెచ్ఎం అశోక్‌రెడ్డి, రిసోర్స్‌పర్సన్లు నరేందర్‌రెడ్డి, విష్ణుమూర్తి, ప్రభాకర్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్ మీదుగా 'వందే భారత్'

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–నాగపూర్ మధ్య వందేభారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే నడిపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. కాగా.. ఇప్పటి వరకు కాజీపేట మీదుగా సికింద్రాబాద్–విశాఖపట్నం, సికింద్రాబాద్–తిరుపతి మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడిపిస్తున్నారు. కొత్తగా కాజీపేట మీదుగా ఢిల్లీ రూట్‌లో వందేభారత్‌ను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రైన్ నడిచే తేదీల్ని త్వరలో ఆయా రైల్వేస్టేషన్లకు పంపించనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. కాగా.. ఇప్పటి వరకు కాజీపేట మీదుగా వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు కాజీపేటలో హాల్టింగ్ లేదు. కొత్తగా ప్రవేశపెట్టే వాటికి హాల్టింగ్ కల్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ బోధించేందుకు అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి ఒక ప్రకటనలో కోరారు. ఫిజిక్స్‌లో ఖాళీగా ఉన్న సబ్జెక్టుకు అధ్యాపకుల ఎంపికకు ఈనెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు ఈనెల 4న మధ్యాహ్నం 12 గంటల్లోపు హాజరు కావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా ఐనవోలు, నడికూడ, వేలేరు, భీమదేవరపల్లి మండలాల్లో (తాత్కాలిక పద్ధతిలో) అర్హత కలిగిన ఫిజియోథెరపిస్టులు, స్పీచ్‌థెరపిస్టుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ వరకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు గడువు పొడిగింపు

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు అపరాధ రుసుముతో ఈనెల 21 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు శుక్రవారం తెలిపారు. పూర్తి వివరాలకు 80084 03631 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీల్లో మిగులు పోస్టుల భర్తీ

హనుమకొండలోని కేజీబీవీల్లో మిగిలిన పోస్టుల భర్తీకి రోస్టర్ కమ్ మెరిట్ అభ్యర్థుల జాబితాను సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు శుక్రవారం హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. పీజీసీఆర్టీ కెమిస్ట్రీ-1, సీఆర్టీ మ్యాథ్స్–1, సోషల్ సీఆర్టీ–1 భర్తీ చేసేందుకు (ఒక పోస్టుకు ముగ్గురు) మెరిట్ లిస్ట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. శనివారం జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు అభ్యర్థులు హాజరు కావాలని డీఈఓ కోరారు.

రిజిస్ట్రేషన్ల జోరు

112 దస్తావేజులు..

రూ.96 లక్షలు ఆదాయం

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్లు జోరుగా కొనసాగాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా భూక్రయవిక్రయదారులు వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పోటెత్తారు. సబ్ రిజిస్ట్రార్లు అంజద్‌అలీ, రాజు సాయంత్రం 7 గంటల వరకు 112 దస్తావేజులను రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ప్రభుత్వానికి రూ.96 లక్షల ఆదాయం సమకూరింది.

రుణ వేట!



'గ్రేటర్' ఆర్థిక పరిస్థితి అయోమయం

- తాజాగా 'కుడా' నుంచి రూ.35 కోట్ల అప్పు
- స్థిరత్వం రేటింగ్ ద్వారా రూ.90 కోట్ల రుణానికి యత్నాలు
- నెలవారీ ఆదాయం.. జీతాలు, పరిపాలనా నిర్వహణకే సరి..

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) రుణవేట మొదలు పెట్టింది. ప్రభుత్వాల నుంచి ఆశించిన మేర నిధులు విడుదల కావట్లేదు. వివిధ మార్గాల ద్వారా బల్దియాకు వచ్చే నెలవారీ ఆదాయం జీతాలు, పరిపాలన నిర్వహణకే సరిపోతోంది. జనరల్ ఫండ్‌తో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన డబ్బులు బరువైపోయాయి. బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు మానేయడంతో అభివృద్ధి మందగించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'కుడా' అప్పు నుంచి బకాయిల చెల్లింపు

అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కావడంతో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) నుంచి కార్పొరేషన్ అధికారులు ఇటీవల రూ.35 కోట్లు అప్పు తీసుకున్నారు. ఈసొమ్ములో కాంట్రాక్టర్లకు 30 శాతం మేర బకాయిల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇకపోతే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండియా రేటింగ్ సంస్థ జాతీయ స్థాయిలో స్థిరత్వం(–ఎ) రేటింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈప్రకారం బల్దియాకు రూ.100 కోట్ల రుణ అర్హత సాధించింది. 10 నెలల కిందట గ్రేటర్ హైదరాబాద్ పెట్టుబడుల నిమిత్తం పబ్లిక్ షేర్లకు పిలిస్తే ప్రజల నుంచి స్పందన లభించలేదు. ఈక్రమంలో తెలంగాణ పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ(టీయూఐఎఫ్) సంస్థ కొత్త ఆలోచన చేసింది. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవాలని సూచించింది. వరంగల్ నగరంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ. 90 కోట్ల రుణం తీసుకునేందుకు గతేడాది నవంబర్‌లో కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అయితే రుణాల కోసం చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు.

ఆదాయం ఇలా..

జీడబ్ల్యూఎంసీకి ప్రధాన ఆదాయ వనరులు ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల ఫీజులే. ఆస్తిపన్ను నెలకు రూ.5కోట్ల నుంచి రూ.6 కోట్లు దాటడం లేదు. ఇతర మార్గాల ద్వారా రూ.2 కోట్లు అన్నీ కలిపి రూ.8కోట్లు సమకూరుతున్నాయి. ఆదాయ మార్గాలకు అన్వేషణ ఉన్నప్పటికీ బల్దియా ఏలికలు, ఉన్నతాధికారులు చొరవ చూపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఖర్చు ఇలా...

బల్దియా ప్రధాన కార్యాలయం ఔట్ సోర్సింగ్ కార్మికులు, సిబ్బంది జీతాలు, తదితర అత్యవసర చెల్లింపులు కలిపి నెలకు రూ.10.50 కోట్లు వ్యయం అవుతోంది. ఇతర కార్మికుల జీతాలకు రూ.5 కోట్లు, కరెంటు బిల్లులు, రూ.3 కోట్లు, డీజిల్, పెట్రోల్ రూ.1.20 కోట్లు, ఇతర అత్యవసర ఖర్చులకు రూ.కోటి వ్యయం అవుతోంది. కాగా.. 10 శాతానికి పైగా బల్దియా సొమ్మును వృథాగా ఖర్చు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇటీవల రూ. 250 కోట్లు మంజూరు

ఇటీవల నగరంలో వరదల బీభత్సం, ఇతర పనుల కోసం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) వరంగల్‌కు రూ.250 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులకు ప్రభుత్వం గ్యారెంటీగా ఉంటుంది. తాజాగా మంజూరైన నిధులకు కూడా బల్దియా నిబంధనల మేరకు ఏడాదికోమారు అసలు, వడ్డీ చెల్లింపు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకవేళ ప్రభుత్వం చెల్లించకపోతే బల్దియా (టీయూఎఫ్ఐడీసీ) మొత్తం రుణాన్ని కిస్తీతోపాటు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని కార్పొరేషన్ అధికారి ఒకరు తెలిపారు. కాగా.. వడ్డీ నామమాత్రం ఉంటుందని పేర్కొన్నారు.

నెలనెలా తిప్పలే!

బల్దియా ఖజానాలో నెలనెలా లోటు ఏర్పడుతోంది. నెలకు రూ.10.50 కోట్లు సర్దుబాటు చేయడం కత్తిమీద సాము అవుతోంది. ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల జీతాలు, ఇంధనం, అత్యవసర బిల్లుల చెల్లించేందుకు అకౌంట్స్ విభాగం అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగోలా సాధారణ నిధులతో జీతాలు, పరిపాలన వ్యయాలను సమకూర్చుతున్నారు. కానీ.. అభివృద్ధి పనుల బిల్లులు, ఇతర బిల్లుల చెల్లింపులను ఆపేశారు. దీంతో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు గత నెలలో పనులు నిలిపేసి సమ్మెబాట పట్టారు. ఈక్రమంలో ఏం చేయాలో దిక్కుతోచక 'కుడా' నుంచి అప్పుగా సొమ్మును స్వీకరించారు. కాంట్రాక్టర్లకు రూ. 80 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. 8 నెలలకు సంబంధించి రూ.30 కోట్లు మంజూరు చేశారు. మరికొన్ని చెక్కులు తయారీ దశలో ఉన్నాయి. తాజాగా కార్పొరేషన్‌కు ఉన్న బాండ్ల ద్వారా జాతీయ బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

నాటకోత్సవాల్ని విజయవంతం చేయండి

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- నేటి నుంచి పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు

హన్మకొండ కల్చరల్: పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలకు నగర ప్రజలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, చలనచిత్రాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మూడ్రోజులు జరిగే పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు శనివారం నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో సాయంత్రం 6గంటలకు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం వినయ్‌భాస్కర్, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, కమిటీ సభ్యులు నాటకోత్సవాల ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి ఆకుల సదానందం, నిమ్మల శ్రీనివాస్, గూడూరు బాలాజీ, వొడపల్లి చక్రపాణి పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

నేటి కార్యక్రమాలు, ప్రదర్శనలు

శనివారం సాయంత్రం 6గంటలకు రచయిత, దర్శకులు, నటులు జీవీ బాబుకు పందిళ్ల శేఖర్‌బాబు స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నారు. వేముల ప్రభాకర్‌కు సన్మానం చేయనున్నారు. రాత్రి 7గంటలకు శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే గమ్యస్థానాలవైపు నాటిక, వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ వారిచే విజయా నిరుద్ధం పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు అలరించనున్నాయి.

మెట్ల బావి అభివృద్ధి పనులు షురూ

- బావిలో డీ–సిల్టింగ్, నీళ్ల తొలగింపు ప్రారంభం
- శరవేగంగా పూడికతీత, సుందరీకరణ

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని చారిత్రక ప్రసిద్ధి చెందిన (రాణి రుద్రమదేవి స్నానాల) మెట్ల బావి అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు మహానగర పాలక సంస్థ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి పర్యవేక్షణలో బావిలో దుర్గంధం, రంగుమారిన నీళ్ల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. భారీ మోటార్లు బిగించి నీటిని తొలగిస్తున్నారు. పూర్తిగా నీళ్లను తొలిగించి, డీ–సిల్టింగ్, పూడికతీత పనులు పూర్తి చేయనున్నారు. పూర్వవైభవం వచ్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. హైదరాబాద్ బన్సీలాల్‌పేటలోని మెట్ల బావి తరహాలో పూర్వ వైభవం వచ్చేలా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు, జవాన్‌కుమార్, స్థానికులు అంజన్న, బిల్లా రాజు, సతీశ్ పాల్గొన్నారు.



మెట్ల బావి నుంచి నీటి తొలగింపును పర్యవేక్షిస్తున్న బల్దియా అధికారులు

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయం, ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరి దేవాలయం, శ్రీహనుమద్గిరి పద్మాక్షి దేవాలయాల్లో శ్రావణమాసం బహుళ పాడ్యమి మూడో శుక్రవారం అమ్మవార్లను లక్ష్మీదేవిగా అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో దేవాలయాలు కిక్కిరిశాయి. ఉదయం నుంచి అర్చకులు అమ్మవార్లకు అభిషేకం, నిత్యాహ్నికం జరిపారు. వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మహిళలు దీపాలు సమర్పించి కుంకుమపూజలు, చీర సారెలతో ఒడిబాల బియ్యం సమర్పించుకున్నారు. పలు దేవాలయాల్లో వరలక్ష్మీవ్రతాలు జరిగాయి.

ప్రముఖుల పూజలు

శుక్రవారం శ్రీభద్రకాళి దేవాలయాన్ని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్, మాజీ కుడా చైర్మన్ మర్రియాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.



అమ్మవారి సన్నిధిలో బోయినపల్లి వినోద్‌కుమార్, వినయ్‌భాస్కర్, తదితరులు

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

- నల్లబ్యాడ్జీలు ధరించి టీచర్ల నిరసన
- అధికారులకు వినతిపత్రాలు

విద్యారణ్యపురి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హనుమకొండ జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో 14 మండలాల్లోనూ ఆసంఘం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన విరామం సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. పీఆర్టీయూ మండలాల బాధ్యులు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డీఆర్ఓ గణేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరునగరి శ్రీనివాస్, ఎద్ల ఉపేందర్‌రెడ్డి, సదానందం, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవిరెడ్డి మాలకొండారెడ్డి, బుచ్చిరెడ్డి, గుర్రంరాజు, వెన్నం రవీందర్‌రెడ్డి, ప్రకాశ్‌బాబు, బండ రమేశ్, ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, చల్లారాజిరెడ్డి జాన్‌సింగ్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

కాశీబుగ్గ సెంటర్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ టీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి, నాయకులు అశోక్ రావు, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో..

విద్యారణ్యపురి: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ, పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తూ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) హనుమకొండ, వరంగల్ జిల్లాలోని పాఠశాలల్లో ఎస్టీయూ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీ లు ధరించి విధుల్లో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాలు అందించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేమునూరి రాంబాబు, ఆట సదయ్య, బోయిన రమేశ్, రాష్ట్ర బాధ్యులు సుధాకర్‌రెడ్డి, బాధ్యులు భీమనాథుని రవి, సాంబయ్య, సూర రమేశ్ ఉపాధ్యాయులు హనుమకొండ కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణకు, వరంగల్ కలెక్టరేట్ ఏఓ టి.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. కాగా.. జిల్లాలో వివిధ మండలాల్లోనూ ఉన్నతి శిక్షణ కేంద్రాల్లో ఉపాధ్యాయులు నల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.



వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు



వరంగల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

ఆ రోజు నేను తప్పించుకున్నా..

నా ముందు వరుసలో ఉన్నోళ్లు బలయ్యారు..

- ఉద్యమకారులపై కురిసిన తుపాకుల తూటాలు
- ఆ తర్వాత అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారు..
- చనిపోయానని రజాకార్లు వెళ్లిపోయారు..
- 1947 సెప్టెంబర్ 2 పరకాల ఘటనను గుర్తు చేసిన చంద్రారెడ్డి
- చాపలబండ రక్తసిక్తమై నేటికి 76 ఏళ్లు



తెలంగాణ సమరయోధుడు రేగూరి చంద్రారెడ్డి

పరకాల: తెలంగాణ సాయుధ పోరాటంలో 1947 సెప్టెంబర్ 2న పరకాలలో జరిగిన పోరాటం చిరస్మరణీయంగా నిలిచింది. ఎంతో మంది ఉద్యమకారుల వీరమరణంతో పరకాల నేల రక్తసిక్తమై నేటికి 76 ఏళ్లు. మరో జలియన్‌వాలా బాగ్‌గా పిలిచే నాటి పోరాటంలో పాల్గొన్న వ్యక్తి పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన 98 ఏళ్ల పోలీస్‌పటేల్ రేగూరి చంద్రారెడ్డి. పోలీస్‌గా పనిచేసిన ఆయన తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్శితులై నిజాం సర్కారుపై తిరుగుబావుటా ఎగురవేశారు. పరకాలలో ఆ రోజు ఏం జరిగింది? అంత మారణహోమం జరగడానికి దారి తీసిన పరిస్థితులపై శుక్రవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణలో రజాకార్ల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోయేది. గ్రామాల ప్రజలు రాత్రింబవళ్లు నిద్రహారాలు మానేవారు. ఎప్పుడు ఏ గ్రామంపైనా.. ఎవరిని ఏం చేస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది. నేను నిజాం సర్కార్‌లోనే పోలీస్ పటేల్‌గా పనిచేసేవాడిని. అప్పటి పరిస్థితులను చూసి ఉద్యోగాన్ని వదిలిపెట్టి మారుపేరు రంజిత్‌తో తిరుగుబాటుదారులైన ఎస్.మనోహర్‌రావు, కేవీనర్సింగరావుకు సన్నిహితమయ్యా. వారి పోరాట కార్యాచరణలో భాగస్వాముడినయ్యా. సాయుధ ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో దామెర మండలంలోని చంద్రగిరి గుట్టలను షెల్టర్‌గా మార్చుకొని నిజాం పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల ఆగడాలపై సాయుధపోరుకు శ్రీకారం చుట్టాం.

మూడు కిలోమీటర్ల పొడవుతో ఊరేగింపు

ఆ రోజు 1947 సెప్టెంబర్ 2. అజ్ఞాతంలోకి వెళ్లిన నేతల పిలుపు మేరకు నిజాం నిరంకుశ పాలనను, రజకారులను ఎదిరిస్తూ త్రివర్ణ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి అనేక గ్రామాలనుంచి వేలాది మంది ప్రజలు పరకాలకు తరలివచ్చారు. యూనియన్ పతాకాలు, వడిసెలు, చేతి కర్రలు పట్టుకుని పతాక వందనానికి కదం తొక్కారు. తొలుత చాపలబండ నుంచి దగ్గు వీరగోపాల్‌రావు నాయకత్వాన ఊరేగింపు నిర్వహించాం. మూడు కిలోమీటర్ల పొడవుతో సాగిన మా ఊరేగింపులో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలవాలని, వందేమాతరం అంటూ నినాదాలు చేశాం.

గర్జించిన నిజాం పోలీసుల తుపాకులు

మా ఊరేగింపు సమాచారం తెలియగానే అప్పటికే ఇక్కడ నిజాం మిలిటరీ పోలీసులు మకాం వేశారు. రజాకారులు కత్తులు, బరిసెలతో సిద్ధమై ఉన్నారు. తహసీల్దార్ విష్ణువేశ్వర్‌రావు ఊరేగింపు వద్దకు వచ్చి వెనక్కి తిరిగి రావాల్సిందిగా మా అందరికి (ఉద్యమకారులకు) హెచ్చరికలు జారీ చేశారు. ఆ హెచ్చరికలను ఖాతరు చేయలేదు. తహసీల్దార్ అనుమతి మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చేతిలోని పిస్తోల్ ధన్‌మని పేలడంతో నిజాం పోలీసుల తుపాకులు గర్జించాయి. మా కంటే ముందు వరుసలో ఉన్న శ్రీశైలంతోపాటు అనేక మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చాపలబండ ప్రాంతం రక్తంతో తడిసిముద్దయింది. అక్కడినుంచి నేను తప్పించుకున్న. వారం రోజులకు నన్ను దొరకబట్టి చిత్రహింసలకు గురిచేశారు. చనిపోయాడనుకొని వెళ్లిపోయారు. కానీ కొన ఊపిరితో బయటపడ్డాను. నాటి ఉద్యమ ఫలితంగా తెలంగాణకు విముక్తి లభించడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాం

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు మేయర్ గుండు సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8 నుంచి 15 రోజుల పాటు నగరంలోని 66 డివిజన్లలో అన్ని వర్గాల ప్రజల్ని కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసినట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు వజ్రోత్సవాల్లో అడుగడుగునా దేశభక్తి భావన, స్వాతంత్ర్య స్ఫూర్తి మేల్కొలిపేలా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో అశోక స్థూపాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా 2.20 లక్షల గృహాలకు జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేసి, ప్రతీ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఫ్రీడమ్ ర్యాలీలు, సామూహిక జాతీయ గీతాలాపన ఘనంగా చేసినట్లు తెలిపారు. కాగా.. నేత కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.3 వేలు పరిహారం ఇవ్వడంపై మేయర్ హర్షం వ్యక్తం చేశారు.

వెబ్‌సైట్‌లో అర్హుల జాబితా

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హుల జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు వరంగల్ డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సీఆర్టీ ఇంగ్లిష్, రెండు సీఆర్టీ గణితం, ఒక సీఆర్టీ తెలుగు, పీజీ సీఆర్టీ నర్సింగ్ ఒక పోస్టును భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు శనివారం ఉదయం ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె కోరారు.

కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చూడాలి

వరంగల్ అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చూడాలని, అందుకు తగిన చర్యలు ముమ్మరంగా చేపట్టాలని బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అర్బన్ మలేరియా, శానిటేషన్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో బయాలజిస్ట్ మాధవరెడ్డితో కలిసి సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. కమిషనర్ ఆదేశానుసారం 66 డివిజన్ల వారీగా దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయించాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. గృహాల నుంచి ఇంటింటా చెత్త సేకరణ విధిగా జరిగేలా శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్‌లు సాంబయ్య, నరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్

మౌనం వీడండి..

- షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయండి
- వరంగల్ సీపీ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: 'ఆకతాయిలతో లైంగిక వేధింపులు ఎదుర్కొనే యువతులు, మహిళలు మౌనం వీడండి. నిర్భయంగా షీ టీమ్స్ అధికారులకు ఫిర్యాదు చేయండి' అని వరంగల్ సీపీ ఏవీ.రంగనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో షీటీమ్స్ ఈఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 208 ఫిర్యాదులు అందినట్లు సీపీ పేర్కొన్నారు. విచారణ అనంతరం 21 మంది పోకిరీలపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు, 134 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 105 మందిపై పెట్టీ కేసులు నమోదైనట్లు, 82 మందికి షీ టీమ్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆగస్టులో 25 ఫిర్యాదులు వచ్చాయని, ఇద్దరిపై క్రిమినల్ కేసులు, 15 మందిపై పెట్టీ కేసులు.. మరో 8 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీపీ రంగనాథ్ తెలిపారు. షీ టీమ్స్‌పై మరింత అవగాహన కల్పించేందుకు షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈఏడాది 134కుపైగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో షీటీమ్ బృందాలు పని చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో ఒక మహిళతో సహా ముగ్గురు ఎస్సైలు, ఒక ఏఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు పని చేస్తున్నారని సీపీ తెలిపారు. ప్రత్యక్షంగా పరోక్షంగా, సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలు, యువతులు లైంగిక వేధింపులకు గురైతే తక్షణమే షీటీమ్స్ నంబర్లు 87126 85142, 100 ఫోన్ చేసి సమాచారం అందించాలని సీపీ కోరారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనాలు నిలిపివేత..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2010 సంవత్సరంలో వివిధ విభాగాల్లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఆగస్టు నెల వేతనాలను యూనివర్సిటీ అధికారులు నిలిపివేశారు. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి తుదినిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం నియమించిన ఐదుగురితో కూడిన కమిటీ జీవో 248ని ఇటీవల హైకోర్టు రద్దుచేసిన విషయం విధితమే. వీరి నియమాకానికి సంబంధించి తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సింటుంది. 2019 నవంబర్‌లో వీరి నియమకాన్ని పూర్తిస్థాయి కేయూ పాలక మండలి ఆమోదించలేదు. అప్పటి అధికారులు తుది నిర్ణయం కోసం ప్రభుత్వానికి ఫైల్ పంపారు. ప్రభుత్వం నియమించిన కమిటీ జీవోను హైకోర్టు రద్దు చేశారని వీరి వేతనం నిలిపివేయాలని అప్పట్లో ఉద్యోగం రాని వినిత నాయిని యూనివర్సిటీ అధికారులకు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. దీంతో యూనివర్సిటీ అధికారులు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలు నిలిపివేయడంతో ఆందోళన చెందుతున్నారు. వేతనాలు రాని ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొందరు శుక్రవారం కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును కలిసి వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, చీప్ విప్ దాస్యం వినయభాస్కర్‌ను కూడా ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

'బీఆర్ఐ' తరలింపు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా ఉన్న బీఆర్ఐ (బ్రిడ్జిస్ ఇన్‌స్పెక్టర్) నార్త్ కార్యాలయం, బీఆర్ఐ (బ్రిడ్జిస్ ఇన్‌స్పెక్టర్) సౌత్ కార్యాలయం తరలింపును రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. కాజీపేటలో ఉన్న రెండు బీఆర్ఐ కార్యాలయాల్లో నార్త్ కార్యాలయం విడదీసి మంచిర్యాలలో బీఆర్ఐ సబ్ యూనిట్ కార్యాలయం, సౌత్ కార్యాలయం విడదీసి భద్రాచలంలో బీఆర్ఐ సబ్ యూనిట్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ఆయా కార్యాలయాలు తరలింపుతో కాజీపేట జంక్షన్‌ను తీవ్ర నష్టం జరుగుతుందనే అంశంపై మీడియాలో కథనాలు ప్రచురితకావడంతోపాటు రైల్వే జేఏసీ నాయకులు నిరసన చేపట్టారు. దీనిపై స్పందించి ప్రస్తుతం తరలింపును రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మెస్ కార్డులను రెన్యూవల్ చేసుకోవాలి

కేయూ క్యాంపస్: కేయూలో వివిధ పీజీ, ప్రొఫెషనల్‌కోర్సుల విద్యార్థులు 2023–24 సంవత్సరానికి హాస్టల్ మెస్ కార్డుల రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలని హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య, అదనపు డైరెక్టర్ సుచరిత పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 4 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత కళాశాల రశీదు, 2022 -23కు సంబంధించిన పాత మెస్ కార్డులు అందించాలని సూచించారు. స్కాలర్‌షిప్ దరఖాస్తు, మెస్‌బకాయిల చెల్లింపు రశీదులను క్యాంపస్‌లోని హాస్టళ్ల ఆఫీస్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్
- వరంగల్ రైల్వే స్టేషన్ తనిఖీ

కాశిబుగ్గ: సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్ శుక్రవారం వరంగల్ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రత్యేక రైలులో కొండపల్లి నుంచి మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, చింతలపల్లి స్టేషన్‌లను తనిఖీ చేసిన ఆయన.. సాయంత్రం 5 గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. మొదటి ప్లాట్‌ఫాంలో పెయిడ్ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించి బస్టాండ్ వైపు స్టేషన్ ముఖ ద్వారాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. అక్కడ నుంచి నేరుగా రైల్వే గూడ్స్ షెడ్డుకు వెళ్లి పరిశీలించారు. అనంతరం మొదటి ప్లాట్‌ఫాంకు చేరుకుని స్త్రీల వెయిటింగ్ హాల్, నిర్మాణ పనులు జరుగుతున్న సాధారణ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. శివనగర్ వైపు ఉన్న పార్కింగ్‌ను పెంచాలన్నారు. కాగా, జడ్ఆర్‌యూసీ మెంబర్ చింతాకుల సునీల్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు డీఆర్ఎంను కలిసి స్టేషన్‌లో ఆటో స్టాండ్‌కు ఉచితంగా అనుమతి కోరగా ఆయన నిరాకరించారు. ఏ రైల్వే స్టేషన్‌లో ఉచితంగా ఉండదని 6 నెలలకు రూ. 3500 చొప్పన ఫీజు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన వెంట సీనియర్ డీసీఎం బస్వరాజు, ఎస్‌ఈఎన్ కోఆర్డినేషన్ కృష్ణారెడ్డి,ఎస్‌ఈఎన్ సౌత్ సజ్జార్, సీనియర్ డీఓఎం సురేష్‌రెడ్డి, సెఫ్టీ ఆఫీసర్ సురేష్, సీనియర్ డీఎస్‌టీ ప్రియా అగర్వాల్, వరంగల్ స్టేషన్ మేనేజర్ బాలరాజ్, సీసీఐ రాజ్‌గోపాల్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ నరేందర్ పాల్గొన్నారు.



బస్టాండ్ వైపు రైల్వే ఎదుట పరిశీలిస్తున్న డీఆర్ఎం భరతేష్‌కుమార్ జైన్

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

హన్మకొండ: నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అల్ క్యాడర్స్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమా రాజేష్ ఖన్నా, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి 9 సంవత్సరాలవుతున్న ఒక్క ఉద్యోగిని కూడా చేయలేదని విమర్శించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీబాద్రి వేణు, ఉద్యోగులు జి.సరిత, సుజాత, మంజుల, ప్రవీణ్, జ్యోతి, వెంకటేశ్వర్లు, ఉష ప్రియా పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు

వందశాతం ఫలితాలు సాధించాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో సమీక్ష

ఏటూరునాగారం: గిరిజన విద్యాసంస్థల్లో టెన్త్ విద్యార్థులు వందశాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని, దీనికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కృషి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ కోరారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగామ డిప్యూటీ డైరెక్టర్లతో పీఓ సమీక్ష నిర్వహించారు. 2023–24వ సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ముందుగా గత సంవత్సర పదో తరగతి ఫలితాలను పాఠశాలల వారీగా సమీక్షించారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి..

ఈ సంవత్సరం 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. ఇందులో భాగంగా మ్యాథమెటిక్స్ , జనరల్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల నుంచి సత్ఫలితాలు రాబట్టడానికి 'మ్యాచింగ్.. బ్యాచింగ్' కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అదేవిధంగా మ్యాథమెటిక్స్‌లో తక్కువ ఫలితాలు నమోదు చేసిన పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏసీఎంఓలకు సూచించారు. ప్రతి పాఠశాలలో కనీసం ముగ్గురు విద్యార్థులను జీపీఎస్ 10/10 సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు పోచం, మంకీడి ఎరయ్య, ఏటీడీవోలు దేశిరాం, భాస్కర్, ఏసీఎంఓలు రవీందర్, హీరాలాల్, శ్రీరాములు, రవిశంకర్, జీసీడీఓ సుగుణ, ఆర్‌పీలు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, తేజ, సంపత్ కుమార్, చెంచయ్య, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ అంకిత్

గెస్ట్ ఫ్యాకల్టీకి ఆహ్వానం

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లా పెంబర్తిలోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా కళాశాలలో హిస్టరీ సబ్జెక్టు బోధించేందుకుగాను గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్‌వీఎస్‌చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866610429 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

5 నుంచి సదరం క్యాంపులు

కరీమాబాద్ : వరంగల్ ఎంజీఎం దవాఖానలో ఈ నెల 5 నుంచి సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ సంపత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ముందుగా మీ సేవ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మానసిక దివ్యాంగులకు 5న, వినికిడి లోపం ఉన్న వారికి 8న, ఆర్థో విభాగానికి సంబంధించిన వారి కోసం 20, 21, 22 తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ కోరారు.

ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఘనత..

- ఆక్యుపెన్సీ రేషియోలో ద్వితీయ స్థానం
- ఆగస్టు 31న రికార్డు స్థాయిలో రూ.2.57 కోట్ల ఆదాయం

హన్మకొండ: రాఖీ పండుగ టీఎస్ ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని సమకూర్చింది. ఆక్యుపెన్సీ రేషియోలో వరంగల్ రీజియన్ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నల్లగొండ రీజియన్ మొదటి స్థానంలో ఉండగా 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో వరంగల్ రీజియన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. రాఖీ పండగ సందర్భంగా ఆర్టీసీ.. వరంగల్ రీజియన్‌లో ప్రత్యేకంగా అదనపు బస్సులు నడిపింది. ఆగస్టు 30న 100 అదనపు బస్సులు, 31న 150 అదనపు బస్సులు నడిపింది. 30న 3.79 లక్షల కిలో మీటర్లు తిరిగి రూ.1.96 కోట్ల ఆదాయం రాబట్టుకోగా, 31న 4.19 లక్షల కిలో మీటర్లు తిరిగి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2.57 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. వరంగల్ రీజియన్‌లో 9 డిపోలుండగా సగటున 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో ప్రయాణికులను చేరవేయగా, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, భూపాలపల్లి, పరకాల, జనగామ డిపోలు 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించాయి.

వరంగల్–1 డిపో ఆల్‌టైం రికార్డు..

టీఎస్ ఆర్టీసీ వరంగల్–1 డిపో ఆల్‌టైం రికార్డు సాధించింది. డిపో బస్సులు 68,966కిలో మీటర్లు తిరిగి రూ.45.48 లక్షలు సాధించి డిపోల వారీగా ఆదాయంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత మాట్లాడుతూ డిపో ఉద్యోగులు అంకితభావంతో పని చేయడంతోనే ఈ రికార్డు సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, డిపో మేనేజర్ వి.వెంకటేశం, అసిస్టెంట్ మేనేజర్లు సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాఖీ పౌర్ణమి రోజు అత్యధిక ఆదాయం వచ్చిన సందర్భంగా ఆర్టీసీ హనుమకొండ డిపోలో ఉద్యోగులు సంబు రాలు జరుపుకున్నారు. ఆగస్టు 31న హనుమకొండ డిపో రూ.30,39,164 ఆదాయాన్ని రాబట్టుకుంది. దీంతో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భాను కిరణ్, డీఎం బి.ధరం సింగ్, పాల్గొన్నారు.



వరంగల్–1 డిపోలో ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత

వల్మిడికి ప్రత్యేక బస్సు సర్వీసులు

జనగామ రూరల్/పాలకుర్తి: పాలకుర్తిలోని వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నూతన ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి జనగామ, పాలకుర్తి, అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి 2, 3, 4 తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ జోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారుపేరు

- కమాండెంట్ కల్నల్ అజయ్ నంద కందూరి

మామునూరు : ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారుపేరని తెలంగాణ ఎన్‌సీసీ 10వ బెటాలియన్ కమాండెంట్, కల్నల్ అజయ్ నంద కందూరి అన్నారు. శుక్రవారం ఖిలావరంగల్ మండలం మామునూరులోని పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపును ప్రారంభించారు. ఈనెల 01 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్న క్యాంపునకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 600 మంది క్యాడెట్లు చేరుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్, కల్నల్ అజయ్ నంద కందూరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ ద్వారా దేశానికి కూడా సేవ చేయొచ్చన్నారు. ప్రతి క్యాడెట్ పోటీతత్వంతో శిక్షణలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సదానందం, సుహాస్ కదం, రాధాకృష్ణ, ప్రవీణ్, రాజయ్య, అనిల్, సజని, సౌరస్య, సతీష్, సందీప్, ఇజాజ్, పవర్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, పుట్లిబాయ్, కుమారస్వామి, సురేందర్, సతీష్ పాల్గొన్నారు.



క్యాడెట్ల లగేజీని పరిశీలిస్తున్న ఎన్‌సీసీ కమాండెంట్

దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్

హన్మకొండ: హక్కుల సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ నెల 10న జరిగే బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పాటించాలన్నారు. దామాషా ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలకు అవకాశాలు కల్పించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 60 సీట్లు కేటాయించాలనే డిమాండ్‌తో ఈ నెల 10న హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో బీసీ సింహగర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కూరపాటి నారాయణ మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు ప్రైవేటు కంపెనీల్లా తయారయ్యాయని దుయ్యబట్టారు. బీసీ వర్గాలను దూరం పెట్టిన రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం సింహగర్జన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజమౌళి, నాయకులు చందా మల్లయ్య, కష్ణమూర్తి, పల్లెపు సమ్మయ్య, డాక్టర్ చిర్ర రాజు గౌడ్, తంగళ్లపల్లి రమేష్, తాళ్ల సంపత్ కుమార్ మేరు, బచ్చు ఆనందం పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్వరాల బారిన టీఎస్ఆర్‌డీసీ విద్యార్థినులు

- ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స
- సాధారణమేనని వైద్యుల ధ్రువీకరణ

కరీమాబాద్: వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలోని పలువురు విద్యార్థినులకు రెండు రోజులుగా జ్వరం వస్తోంది. దీంతో ప్రిన్సిపాల్ సురేశ్.. జిల్లా వైద్యాధికారులకు సమాచారం అందించి కళాశాలలో వైద్యశిబిరం నిర్వహించడమే కాకుండా సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం 26 మందిని ఎంజీఎంకు తరలించి పరీక్షలు చేయించారు. రిపోర్టులన్నీ నార్మల్‌గా రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, విద్యార్థినులకు సాధారణ జ్వరమే ఉందని, చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేస్తామని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నీవు చస్తే.. మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటా..

- పెళ్లయిన ఆరు నెలలకే భర్త వేధింపులు
- మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య
- మృతురాలు రెండు నెలల గర్భిణి



అర్చన (ఫైల్)

రఘునాథపల్లి: వారికి పెళ్లయి ఆరు నెలలైంది. ఆమె రెండు నెలల గర్భిణి. కానీ భర్త.. మరో అమ్మాయితో చనువుగా ఉన్న ఫొటోలను చూసి ఇదేమిటని అడిగితే 'నీవు చస్తే.. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా. ఉరి వేసుకొని చావు' ..అంటూ ఈసడించుకోవడంతో మనస్తాపానికి గురైన వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మద్దూరి కృష్ణ–రేణ దంపతుల కుమార్తె అర్చన అలియాస్ హర్షిణి (20)ని పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మల్యాల అంజనేయులు కుమారుడు వినేష్‌కు ఈ ఏడాది మార్చి 10న ఇచ్చి వివాహం జరిపారు. 20 రోజుల క్రితం అర్చనను భర్త, తల్లి కలిసి జనగామలోని ఓ అస్పత్రికి తీసుకెళ్లి చూపించగా రెండు నెలల గర్భిణిగా వైద్యులు నిర్ధారించారు. అక్కడి నుంచి అర్చనను భర్త వినేష్ తన ద్విచక్రవాహనంపై పుట్టింటికి తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. గత నెల 31న వినేష్ భార్య వద్దకు చేరుకున్నాడు. భర్త సెల్‌ఫోన్‌ను అర్చన పరిశీలిస్తుండగా వినేష్ మరో యువతితో సాన్నిహిత్యంగా ఉన్న ఫొటోలను గుర్తించింది. ఆ అమ్మాయి ఎవరు అని నిలదీయగా 'నీవు చస్తే.. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా, ఉరి వేసుకొని చావు' ..అంటూ కోపంతో భర్త వెళ్లిపోయాడు. దీంతో అర్చన తీవ్ర మనోవేదనకు గురైంది. శుక్రవారం ఉదయం భర్త వినేష్... అర్చనకు ఫోన్ చేసి గొడవ పడ్డాడు. ఈ విషయం అర్చన తల్లిదండ్రులకు చెప్పి ఏడ్చింది. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లాక తీవ్ర మనోవేదనతో ఉన్న అర్చన బాత్‌రూంలోకి వెళ్లి చీరతో ఉరివేసుకుంది. పక్కింటి వారు గుర్తించి ఉరి నుంచి అర్చనను విడదీయగా అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న కొద్ది సేపటికే మరణించింది. అల్లుడు వినేష్ వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వినేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

ఏడాది క్రితం కొడుకును కోల్పోయి..

కృష్ణ–రేణ దంపతులకు కుమారుడు మహేష్, కూతురు అర్చన ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం కుమారుడు మహేష్ భువనగిరి జిల్లాలో అనుమానాస్పదంగా మరణించాడు. అప్పటికే కూతురు అర్చనకు పెళ్లి ఖాయం కావడంతో వివాహం జరిపించారు. పెళ్లి అయిన ఆరు నెలలకే కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరి హృదయాలను కలిచివేసింది.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసై భార్యను కడతేర్చిన భర్తను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాఘవేందర్ కథనం ప్రకారం మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో సయ్యద్ హజరత్‌బీని ఆమె భర్త సయ్యద్ అమీర్ గత నెల 29వ తేదీన హత్య చేసిన విషయం విదితమే. మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వమని అమీర్ తరచూ భార్యతో గొడవపడేవాడు. ఆమె కూలీ డబ్బును బలవంతంగా తీసుకుని మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన అమీర్.. మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. ఆమె నిరాకరించడంతో అదేరోజు అర్ధరాత్రి హత్య చేసి పారిపోయాడు. దీనిపై మృతురాలి తండ్రి ఖాసీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శివునిపల్లిలో అమీర్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

కిడ్నాప్ కేసులో మరో ఆరుగురు..

చిట్యాల: మండలంలోని గిద్దె ముత్తారం గ్రామానికి చెందిన మామిడి సమ్మయ్యను భూతగదాల విషయంలో ఇటీవల కొందరు కిడ్నాప్ చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న చిట్యాల పోలీసులు.. వారం రోజుల నుంచి బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించారు. శుక్రవారం గట్టు రాజు, అరెల్లి అఖిల్, మల్లెపు శ్రీకాంత్, అజ్మీరా నవీన్, హట్కర్ రాజు, లాడెళ్ల అనిల్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 6 సెల్ ఫోన్‌లు, రూ. 80వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జె. రమేష్ తెలిపారు. కాగా, ఒకరు పరారీలో ఉన్నారని ఎస్సై పేర్కొన్నారు. త్వరితగతిన కేసు ఛేదించిన చిట్యాల సీఐ వేణు చందర్, ఎస్సై రమేష్, సిబ్బంది సిద్ధార్థ, నవీన్, వేణును భూపాలపల్లి డీఎస్పీ రాములు, ఎస్పీ కరుణాకర్ అభినందించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చోరీ చేసి.. చేతికి చిక్కి..

ఉమ్మడి జిల్లా వ్యాపంగా 8 మంది అరెస్ట్

- వివిధ చోరీలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన దొంగలు
- వివరాలు వెల్లడించిన పోలీసులు


ధర్మసాగర్: జల్సాలకు అలువాటు పడి చోరీలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్మసాగర్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ కె శ్రీధర్ రావు వివరాలు వెల్లడించారు. రెండు మూడు రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాలలో పార్క్ చేసిన ట్రాక్టర్ బ్యాటరీల చోరీ ఘటనలపై యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయిపేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అంబాల మహేష్, కుమ్మరి ప్రవీణ్, భాస్కకుల అఖిల్, మారపాక అనూప్ కుమార్.. ట్రాక్టర్ బ్యాటరీలను చోరీ చేసి పారిపోతున్నారు. ఇది గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రూ. 50 వేల విలువైన 6 బ్యాటరీలు, ఒక గ్యాస్ సిలిండర్, ఒక టీ ఫ్లాస్క్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు. సమావేశంలో ఎస్ఐలు బి రాజు, పి ఫిలప్ రాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురవిలో మరో వ్యక్తి..

కురవి: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన మామిడి గోపి ఈనెల 28వ తేదీన కురవిలోని గంగమ్మ తల్లి ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. అదే విధంగా గత జూన్ 16వ తేదీన మండలంలోని తాట్య తండాలో హనుమాన్ ఆలయం, కురవిలోని రామాలయంలో వరుస చోరీలకు పాల్పడ్డాడు. దీనిపై ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం దర్యాప్తు చేపట్టి గోపిని శుక్రవారం అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తగూడలో మహిళలు..

కొత్తగూడ: ముగ్గురు మహిళలు చోరీ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంలోని 'నానో' బట్టల షాపులో దుస్తులు కొనుగోలు చేసేందుకు ముగ్గురు మహిళలు వచ్చారు. ఇద్దరు మహిళలు దుస్తులను పరిశీలిస్తున్నట్లు నటించగా.. మరో మహిళ చీరలను కట్టుకుంది. ఈ ఘటనను సీసీ కెమెరాలో గమనించిన షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో షాపు వద్దకు చేరుకున్న ఎస్సై నగేష్ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. రద్దీగా ఉండే షాపులను టార్గెట్‌గా చేసుకుని వీరు చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్సై తెలిపారు.



ధర్మసాగర్:వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రావు

హసన్‌పర్తిలో ఇంకో వ్యక్తి..

హసన్‌పర్తి : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి... కాపర్ వైర్లు చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏసీపీ డేవిడ్ రాజు కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన చిలువేరు శంకర్ జల్సాకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో హసన్‌పర్తి, ఎల్కతుర్తి, ధర్మసాగర్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ నిర్మానుష్య ప్రదేశాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను చోరీ చేస్తున్నాడు. ఈ క్రమంలో బాహుపేట క్రాస్‌వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో శంకర్ ఆటోను ఆపకుండా వెళ్లాడు. దీంతో పోలీసులు ఆటోను పట్టుకుని విచారించగా కాపర్ వైర్లు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అనంతరం శంకర్ వద్ద నుంచి రూ.38 వేలు విలువైన కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ డేవిడ్ రాజు చెప్పారు. కాగా, శంకర్ 14 ఏళ్ల నుంచి చోరీలకు పాల్పడుతున్నట్లు డేవిడ్ రాజు తెలిపారు. సమావేశంలో సీఐ గోపి, ఎస్సై రాజు, అశోక్, కానిస్టేబుల్ క్రాంతికుమార్, ఏఏవో సల్మాన్ పాషా నగేష్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి : శంకర్ అరెస్ట్‌ను చూపుతున్న ఏసీపీ